క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాల్సిందే..

పూసపాటిరేగ: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఇ. భాస్కరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో వీఆర్‌ఓలు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం గ్రామాలలో బ్యానర్లు, పోస్టర్లు తొలిగించాలన్నారు. గ్రామ సచివాలయాల గోడలపై ఎవ్వరి ఫొటోలు ఉండరాదని చెప్పారు. పూసపాటిరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


పారిశుధ్య నిర్వహణపై డీఎంహెచ్‌ఓ ఆగ్రహం



పాఠశాల ప్రాంగణంలో మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ రమణకుమారి

విజయనగరం: నగరంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణపై డీఎంహెచ్‌ఓ ఎస్‌వీ రమణ కుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించి, తాగునీటి ట్యాంక్‌ల నుంచి మురుగునీరు ప్రవహించడంపై మండిపడ్డారు. అపరిశుభ్ర వాతావరణంతో దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి సత్యనారాయణను హెచ్చరించారు.

శ్రీక్షేత్రమ్‌లో ప్రత్యేక పూజలు



శ్రీకృష్ణుని అవతారంలో శ్రీనివాసుడు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడలో భారతీయ తత్త్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీనివాసుడికి కృష్ణుని అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ అర్చకులు చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు, చామర్తి రమేష్ ఆచార్యులు వేదమంత్రాల నడుమ స్వామికి పూజలు నిర్వహించారు. ఉత్సవంలో దేవాలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న అనురాధ

విజయనగరం ఫోర్ట్: ఆకతాయిలు, పోకిరీల విషయంలో ఆడ పిల్లలు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. శుక్రవారం స్థానిక గురజాడ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన సఖి కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ఆడపిల్లలు శారీరకంగా, దృఢంగా ఉండాలన్నారు. మనోధైర్యం కలిగి ఉండాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టడానికి కృషి చేయాలన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత



మాట్లాడుతున్న జిల్లా సమన్వయ అధికారి రామకృష్ణ

బొండపల్లి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని ఎస్‌బీసీసీ జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని దేవుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. తక్కువ వయసులో పెళ్లి చేయడం వల్ల బాలికల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోదవ్యాధి నియంత్రణకు డీఈసీ మాత్రలు

వేపాడ: బోద వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం చేపట్టిన డీఈసీ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ బీఎస్ఎన్‌కే పట్నాయక్, పీహెచ్‌సీ డాక్టర్ ఎ.ధరణి అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో రెండు సంవత్సరాలు పైబడిన పిల్లలందరికీ డీఈసీ, అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, ఆశ వర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎట్టకేలకు ఆక్రమణల తొలగింపు

- ఎల్బీనగర్‌లో కార్పొరేషన్ రోడ్డు ఆక్రమణ
- రంగంలోకి దిగిన టౌన్ ప్లానింగ్ అధికారులు
- సీపీఎం, టీడీపీ నాయకుల ఆందోళనతో స్వల్ప ఉద్రిక్తత
- అనంతరం స్వచ్ఛందంగా ఖాళీ చేసిన ఆక్రమణదారులు



ఎల్బీనగర్‌లో జేసీబీతో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలతో కుచించుకుపోయిన 65 అడుగుల రోడ్డు ఇదే



ఆక్రమణల తొలగింపును వ్యతిరేకిస్తూ నిరసన చేపడుతున్న సీపీఎం నాయకులు

విజయనగరం: నగరంలో చోటుచేసుకున్న ఆక్రమణలపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా 49వ డివిజన్ ఎల్బీనగర్ ప్రాంతంలో బొంకులదిబ్బ రోడ్డును ఆక్రమించి నివసిస్తున్న వారిని శుక్రవారం ఖాళీ చేయించారు. కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు ప్రారంభించిన ప్రక్రియను వ్యతిరేకిస్తూ సీపీఎం, టీడీపీ నాయకులు ఆందోళన చేపట్టడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకోగా... వన్‌టౌన్ పోలీసులు జోక్యం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ఇళ్లను ఖాళీ చేయడంతో అధికారులు తొలగింపు పనులు చేపట్టారు. ఈ ప్రక్రియను టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీప్లానర్లు అమ్మాజీరావు, మధుసూదనరావు, టీపీబీఓ ఫిలిప్, సచివాలయ కార్యదర్శులు, వన్‌టౌన్ పోలీసులు దగ్గరుండి పర్యవేక్షించారు.

కార్పొరేషన్ రోడ్డును ఆక్రమించిన 117 కుటుంబాలు..

ఎల్బీనగర్ నుంచి విజయనగరం రైల్వేస్టేషన్ విభాగం వరకు సర్వే రికార్డుల ప్రకారం 65 అడుగుల వెడల్పు రోడ్డును కేటాయించారు. ఈ ప్రాంతంలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన 117 కుటుంబాలు షెడ్లు వేసుకుని నివాసముంటున్నాయి. దీంతో ఆ రోడ్డు 12 అడుగులకు కుంచించుకుపోయింది. గతంలో రోడ్డును ఆక్రమించిన వారంతా ఖాళీ చేయాలని కార్పొరేషన్ అధికారులు ఒత్తిడి తీసుకువచ్చినప్పటికీ వారు స్పందించలేదు. అక్రమణదారుల్లో 18 మంది కోర్టును ఆశ్రయించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఎటువంటి సొంతిళ్లు లేని సుమారు 70 మందికి ప్రభుత్వం వివిధ పథకాల్లో భాగంగా ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించింది. ఏపీ టిడ్కో, జగనన్న కాలనీల్లో వారికి సొంతిళ్లు మంజూరు చేశారు. ఓ వైపు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించినప్పటికీ ఆక్రమిత ప్రాంతాలను వదిలివెళ్లకపోవటం గమనార్హం. దీంతో అధికారులు స్పందించి వారిని అక్కడి నుంచి తరలించే చర్యలు ప్రారంభించారు. ఆక్రమితదారులు సామాన్ల తరలింపు కోసం వాహనాన్ని కార్పొరేషన్ అధికారులు కేటాయించారు.

రైల్వేస్టేషన్ వెనుక గేటు కోసమే ఆ రోడ్డు..

పెరుగుతున్న ప్రజావసరాల దృష్ట్యా భవిష్యత్‌లో విజయనగరం రైల్వేస్టేషన్ విస్తరించాల్సిన సమయంలో వెనుక గేటు కోసమే 65 అడుగుల వెడల్పుతో రోడ్డును కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం విజయనగరం రైల్వేస్టేషన్‌కు పైడితల్లి వనంగుడి ఎదురుగా ఒకేఒక్క మార్గం ఉంది. భవిష్యత్ అవసరాల దృష్ట్యా రైల్వేస్టేషన్ విస్తరించాల్సి వస్తే వెనుక గేటు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆ సమయంలో వాహనాల రాకపోకల కోసం రోడ్డును కేటాయించినట్లు సమాచారం. అయితే ప్రస్తుతానికి ఖాళీగా ఆ మార్గాన్ని పలువురు ఎస్సీ సామాజికవర్గానికి చెందినవారు ఆక్రమించి షెడ్లు నిర్మించుకుని జీవిస్తుండగా... వారందరినీ తొలగించే చర్యలు చేపడుతున్నారు.

ఆక్రమణలు మాత్రమే తొలగిస్తున్నాం..

ఎల్బీనగర్‌లో రోడ్డును ఆక్రమించి నివాసముంటున్న వారిని తొలగిస్తున్నాం. కార్పొరేషన్ సర్వే రికార్డుల ప్రకారం 65 అడుగుల వెడల్పు గల రోడ్డు ఆక్రమణలకు గురైంది. ఇప్పటికే పలు మార్లు ఆక్రమణదారులను హెచ్చరించాం. వారు స్పందించకపోవడంతో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఖాళీ చేయిస్తున్నాం. ఈ ప్రాంతంలో నివాసముంటున్నవారికి ఇప్పటికే వివిధ ప్రభుత్వ పథకాల్లో ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించడం జరిగింది.

– అమ్మాజీరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్, విజయనగరం కార్పొరేషన్.

ప్రతి ఒక్కరిపై డెంఖే షావలి బాబా ఆశీస్సులు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్, తదితరులు

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌కౌశిక్

విజయనగరం: డెంఖే షావలి బాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి. ఈశ్వర్‌కౌశిక్ ఆకాంక్షించారు. బాబా ఉరుసు ఉత్సవాలలో భాగంగా శుక్రవారం దర్గాను దర్శించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారికి సాదర స్వాగతం పలికారు. అనంతరం వీరి చేతుల మీదుగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రావణి, ఈశ్వర్‌కౌశిక్ మాట్లాడుతూ, సుదీర్ఘ చరిత్ర కలిగిన డంఖే షావలి బాబా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నారన్నారు. ఉత్సవంలో కేవలం విజయనగరం జిల్లా నుంచి కాకుండా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్ర, తెలంగాణలకు చెందిన భక్తులు పాల్గొంటున్నారని చెప్పారు. దర్గా పీఠాధిపతి చోటు బాబు మాట్లాడుతూ, ప్రతి ఏటా ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటామన్నారు. ఈ ఏడాది మూడు రోజుల ఉత్సవంలో సుమారు 50 వేల మంది భక్తులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

శతశాతం యూజర్ చార్జీల వసూలే లక్ష్యం

- డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రవీణ్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కార్పొరేషన్ అధికారులు

విజయనగరం: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలవుతున్న క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) అమలులో భాగంగా శతశాతం యూజర్ చార్జీలు వసూలే లక్ష్యంగా అధికారులు మరింత కృషి చేయాలని డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రవీణ్‌కుమార్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, యూజర్ చార్జీల వసూలుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చార్జీలు వసూలైతే పారిశుధ్య నిర్వహణ మరింత బాగా నిర్వహించవచ్చన్నారు. అనంతరం నగరంలో జరుగుతున్న రీ సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ శ్రీరాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఈఈ శ్రీనివాసరావు, నగర సర్వేయర్ సింహాచలం, కార్యదర్శులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటాం..



అగ్నిప్రమాద బాధితులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు

పూసపాటిరేగ: అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటామని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని కనిమెట్టలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను శుక్రవారం పరామర్శించారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ. ఐదు వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వపరంగా ఇళ్లు మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శాంతాటి శ్రీను, పల్ల సత్యం పాల్గొన్నారు.

డీఈసీ మాత్రలు వేసుకోవాలి

- అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి రవీంద్ర



వైద్యాధికారి పర్యవేక్షణలో మాత్ర వేస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల: డీఈసీ, ఆల్బెండజోల్ మాత్రలను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా వేసుకోవాలని నెల్లిమర్ల నగర పంచాయతీ అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి బి. రవీంద్ర పిలుపునిచ్చారు. పట్టణ పరిధిలోని 20 వార్డుల్లో డీఈసీ, ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు శుక్రవారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన రవీంద్ర మాట్లాడుతూ, డీఈసీ మాత్రలు వేసుకోవడం ద్వారా ఫైలేరియా, ఆల్బెండజోల్ వేసుకోవడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చునన్నారు. మరో రెండు రోజులు మాత్రలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

హెచ్‌ఎం సస్పెన్షన్

విజయనగరం పూల్‌బాగ్: గజపతినగరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌరినాయుడును జిల్లా విద్యాశాఖాధికారి బి. లింగేశ్వరరెడ్డి సస్పెండ్ చేశారు. వర్క్ ఎడ్జస్ట్‌మెంట్‌కు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారి ఇచ్చిన ఆదేశాలను అమలు చేయనికారణంగా సస్పెండ్ చేసినట్లు డీఈఓ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గజపతినగరం ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయుడిని వేరే పాఠశాల పంపించాల్సి ఉంది. ఆ ఉపాధ్యాయుడుని రిలీవ్ చేయని కారణంగా హెచ్‌ఎంను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

విజయనగరం ఫోర్ట్: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వన్‌టౌన్ సీఐ కాంతారావు అన్నారు. ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ, బాలలతో పనిచేయించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. బడిబయట ఉన్న పిల్లలను వెంటనే పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ రామాదేవి, నేచర్ సంస్థ ప్రతినిధి దుర్గ, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ సోషల్‌వర్క్ విద్యార్థులు రమాకాంత్, తిరుపతిరావు, సంధ్య, సుబేదీ, తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు



వేతనదారులతో మాట్లాడుతున్న డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి

డెంకాడ: ఉపాధి వేతనదారులు కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు 257 రూపాయల వేతనం గిట్టుబాటు అవుతుందని డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి అన్నారు. మండలంలోని సింగవరం పంచాయతీలోని దొడ్డిబాడువ డ్యామ్ నుంచి జంపన్న గారి బట్టి వరకు జరుగుతున్న కాలువ పూడికతీత పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల మస్టర్లు పరిశీలించారు. పూర్తిస్థాయిలో పనులు జరగాలని, పని ప్రదేశంలో తాగునీరు, టెంట్, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ వై.వెంకటరమణ, ఎఫ్‌ఏ గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పీఎంపాలెం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు

గంట్యాడ: రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు పెదమజ్జిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్–14, అండర్–17 విభాగంలో పాఠశాలకు చెందిన పొన్నాడ బాలాదిత్య, ఎస్.రామకృష్ణ, దిలీప్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరు ఈనెల 11 నుంచి 13 వరకు కృష్ణా జిల్లా ఈడుపుగల్లులోని శాప్ స్విమ్మింగ్ పూల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం ఎం.జి.విజయలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు అభినందించారు.


వైభవంగా సహస్ర దీపాలంకరణ



దీపాల కాంతుల శోభలో స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవ శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. అర్చకస్వాములు వేకువ జామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగశాలలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వెండి మంటపం వద్ద నిత్య పూజలు చేశారు. సాయంత్రం సీతారామచంద్రస్వామిని నూతన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి తూర్పు రాజగోపురం వద్దనున్న ప్రాంగణ వేదికపై ప్రత్యేక ఊయలలో ఆశీనులు చేశారు. అనంతరం దీపాలు వెలిగించి, వేద మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక ఊయల్లో స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో ముఖ్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అప్పారావు

వేపాడ: నేటి విద్యార్థులే రేపటి పౌరులని, క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.అప్పారావు అన్నారు. శుక్రవారం కళాశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరుకునేందుకు ప్రణాళికతో ముందుకుసాగాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

జనసేన నాయకుల హల్‌చల్

- రోడ్డు విస్తరణ పనులు అడ్డుకున్న వైనం



కార్పొరేటర్ బోనెల ధనలక్ష్మిపై దూసుకువస్తున్న యశస్వి

విజయనగరం క్రైమ్: అభివృద్ధి పనుల్లో భాగంగా నగరంలో చేపడుతున్న రహదారుల విస్తరణ పనులను జనసేన నాయకులు శుక్రవారం అడ్డుకున్నారు. బొగ్గులదిబ్బ ఎక్సైజ్ కార్యాలయం నుంచి గర్ల్స్ హైస్కూల్‌కి వెళ్లే రహదారి అభివృద్ధి పనులను పాలవలస యశస్వి ఆధ్వర్యంలో కొంతమంది అడ్డుకోగా.. పోలీసులు వారించారు. ఇదిలా ఉంటే యశస్వి ఆధ్వర్యంలో పలువురు నాయకులు తన ఇంటికి వచ్చి కులంపేరుతో దూషించారని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ బోనెల ధనలక్ష్మి తెలిపారు. దీంతో మరో కార్పొరేటర్ సుంకర నారాయణస్వామితో (బాబు) కలిసి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జేఎన్‌టీయూలో ముగిసిన ఫ్యాకల్టీ సదస్సు



ఫ్యాకల్టీ సదస్సులో పాల్గొన్న వివిధ ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపకులు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ప్రాంగణంలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు రోజులుగా యూనివర్సిటీ ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మిషన్ లెర్నింగ్ అండ్ డీప్ లెర్నింగ్ అంశాలపై నిర్వహించిన ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ అవగాహన సదస్సు శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్‌ఐటీ వరంగల్ బోధనకుడు డాక్టర్ కేవీ కధంబరం, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సాంకేతిక కోర్సులపై అధ్యాపకులకు తప్పనిసరిగా అవగాహన ఉండాలన్నారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ జి.స్వామినాయుడు ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు. రిసోర్స్‌పర్సన్స్‌గా ఐఐటీ, ఎన్‌ఐటీ, స్టేట్ యూనివర్సిటీలు, పరిశ్రమల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. యూనివర్సిటీ ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ సెల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ జి.జయసుమ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, యూవర్సిటీ డైరెక్టర్లు ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, ప్రొఫెసర్ కె.చంద్రభూషణ్, ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, ప్రొఫెసర్ కె.బాబులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో వ్యవసాయ రంగం

- వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సీహెచ్ మాధవరావు

లక్కవరపుకోట: వ్యవసాయ రంగాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి వెలకట్టలేనిదని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సీహెచ్ మాధవరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ భవనంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులను ప్రోత్సహించేలా.. వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకొచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రైతులంతా రుణపడి ఉంటారన్నారు. గ్రామాల్లో ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా నిర్వహించామన్నారు. మండల వ్యవసాయాధికారి స్వాతికుమారి మాట్లాడుతూ..ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా ముగిసిందన్నారు. చెరువుల్లో పుష్కలంగా నీరు ఉండడంతో పలు ప్రాంతాల్లో రైతులు రబీలో వరి సాగు చేసేందుకు ముందుకొచ్చారన్నారు. వారికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సిద్ధం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రూపేష్, పశువైద్యాధికారి కె.గాయత్రీదేవి పాల్గొన్నారు.

పుణ్యగిరి జాతర ఏర్పాట్లపై ఆర్డీఓ సమీక్ష

శృంగవరపుకోట: పుణ్యగిరి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ చంద్రకళ అధికారులను ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పుణ్యగిరి జాతర ఏర్పాట్లపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. వివిధశాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లును పర్యవేక్షించాలన్నారు. పుణ్యగిరి ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పి.రామకృష్ణ మాట్లాడుతూ.. రైల్వేట్రాక్ తర్వాత రోడ్డులో ఆక్రమణలు పెరిగిపోవడంతో ఇరుకుగా తయారైందని, భక్తులకు శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణాన్ని అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, స్నానఘట్టం వద్ద ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆర్డీఓ దృష్టికి తీసుకువెళ్లారు. జాతర కోసం కొంత మొత్తం నిధులు కేటాయించాలని ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు కోరారు. ఇరుకు రోడ్డులో ఇరువైపుల నుంచి బస్సులు వస్తే ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని ఎస్సై తారకేశ్వరరావు చెప్పగా.. సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని ఆర్టీసీ డీఎం రమేష్‌కు సూచించారు. దేవస్థానం ఈఓ నాగేంద్ర జాతర ఏర్పాట్లను ఆర్డీఓకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ శేషుబాబు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, సీఐ సింహాద్రినాయుడు, పుణ్యగిరి ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆర్టీసీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఈబీ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.